కాంతి రేఖ.. భోగి భాగ్యాల వేడుక


పందలపాకలో భోగి మంటలో దండ వేస్తున్న చిన్నారులు


దోమాదలో భోగి మంట వద్ద సందడి


రాజానగరంలో గొబ్బెమ్మకు పూజలు చేస్తూ..


రఘుదేవపురంలో భోగి మంట వద్ద సందడి

- బంధుమిత్రులతో పల్లెల్లో సందడి
- ఆనందంగా సంక్రాంతి సంబరాలు

బిక్కవోలు: కణకణ రవ్వలు.. చీకటిని చీల్చే వెలుగులు.. పాతను వదిలి కొత్తకు ఆహ్వానాలు.. పిల్లా పాపల కేరింతలు.. తెలుగువారి సంస్కృతిని చాటే భోగి భాగ్యాల వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. మన సంస్కృతీ సంప్రదాయాలను చాటే ఈ పండగను అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో వేడుకగా నిర్వహించారు. శనివారం భోగి కావడంతో పట్టణాల నుంచి బంధువులు, మిత్రులు, కుటుంబ సమేతంగా పల్లెలకు తరలివచ్చారు. కొత్త అల్లుళ్లతో ప్రతి ఇల్లూ కళకళలాడుతోంది. కుటుంబ సభ్యులంతా ఒకచోటకు చేరి ఆనందంగా గడుపుతున్నారు. హరిదాసుల హరినామ కీర్తనలతో వీధులు సందడిగా మారాయి. మహిళలు పోటీపడి ఇళ్ల ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దుతున్నారు. దీంతో పల్లెల్లో సంక్రాంతి శోభ వెల్లివిరిస్తోంది. శీతాకాలపు చలి, తొలి మంచు తెరల చాటున యువకులు ఊరూరా భోగి మంటలు వేశారు. వేకువ జామునే నిద్రలేచి సేకరించిన కలపతో మంటలు వేసి వేడుకలు నిర్వహించారు. ఈ మంటల వద్ద చిన్నా పెద్దా సందడి చేశారు. పిల్లలు భోగి పిడకల దండలను మంటలో వేశారు. ఇదిలా ఉంటే ప్రతి ఇంటా పిండి వంటలు ఘుమఘుమలాడుతున్నాయి. ఊలపల్లిపాకల వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ఎంపీటీసీ బండారు శివ బహుమతులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: సంక్రాంతి పండగ పల్లె సీమలకు నవక్రాంతిని తెచ్చింది. గ్రామాల్లో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. శనివారం భోగి పండగను అనపర్తి, రూరల్ మండలాల్లో సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. ప్రజలు వేకువజామునే స్నానాలాచరించి కొత్త దుస్తులు ధరించి భోగి మంటల చుట్టూ తిరుగుతూ గో పిడకలు వేశారు. ప్రజలు ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

పెదపూడి: మండలంలో భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. చిన్నారులు, పెద్దలు మంటలను ఉత్సాహంగా వెలిగించారు. ప్రధానంగా పెదపూడి, పెద్దాడ, జి.మామిడాడ, రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు, సంపర, కాండ్రేగుల, శహపురం, గండ్రేడు, పుట్టకొండ, కుమారప్రియం, చింతపల్లి, వేండ్ర, పైన, రాజుపాలెం, దోమాడ, కైకవోలు తదితర గ్రామాల్లో ప్రజలు వేడుకలు జరుపుకొన్నారు. ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు.

రంగంపేట: మండలంలోని గ్రామాల్లో భోగి మంటలు వెలుగులీనాయి. ప్రతి ఇంటా రంగవల్లులు వేసి గొబ్బెమ్మలతో అందంగా తీర్చిదిద్దారు. ఈ భోగి మంట చుట్టూ భక్తులంతా హరినామ సంకీర్తనతో ప్రదర్శనలు చేశారు.

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో భోగి పండగను ఘనంగా జరుపుకొన్నారు. ప్రజలు భోగి మంటలు వేసి అందులో గో పిడకల దండలను వేశారు. అనంతరం ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ప్రతి ఇళ్లు బంధువులతో కళకళలాడాయి.

గొబ్బెమ్మలకు పూజలు

రాజానగరం: సంక్రాంతి సంబరాలలో గొబ్బిళ్లకు ప్రాధాన్యం తగ్గలేదు. ఈ గొబ్బిళ్లను ఆవు పేడతో ఐదు ముద్దలుగా చేసి వాకిళ్లలో పెడతారు. ఆపై వాటిని పువ్వులతో అందంగా అలంకరించి, పూజలు చేసి, ప్రదక్షిణలు చేస్తారు. శనివారం సాయంత్రం రాజానగరంలో కొంతమంది ఔత్సాహికులు తమ వాకిళ్లలో గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో శ్రీకృష్ణుని చిలిపి చేష్టలను వర్ణిస్తూ పాటలు పాడారు.

గోకవరం: సంక్రాంతి పండగను నియోజకవర్గ ప్రజలు సాంప్రదాయంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. గోకవరంలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంప్రదాయ కోడి పందేలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తెలుగు వారి పెద్ద పండగ అయిన సంక్రాంతిని ప్రజలంతా కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా జరుపుకోవాలని కోరారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, నాయకులు దాసరి రమేష్, వరసాల ప్రసాద్, ముత్యాల శ్రీనివాస్, కర్రి సూరారెడ్డి, చింతల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


జి.మామిడాడలో అయ్యప్పస్వామి ఆభరణాల పెట్టె ఊరేగింపు


అనపర్తిలో గోదా రంగనాయకులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


కోరుకొండలో గోదాదేవి, రంగనాథ స్వామివారి కల్యాణం

అనపర్తి: స్థానిక పాతవూరిలో సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి రామాలయంలో శనివారం గోదా రంగనాయకుల కల్యాణం వైభవంగా జరిగింది. ధనుర్మాసం ముగింపు సందర్భంగా స్వామి అమ్మవార్లను శేష వాహనంపై అందంగా అలంకరించి వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ పరిణయోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనపర్తికి చెందిన తమలంపూడి సూర్రెడ్డి, పద్మావతి దంపతులచే అర్చకులు పెద్దింటి కృష్ణమాచార్యులు, వేదాంతం భాస్కరాచార్యులు కల్యాణ క్రతువును వైభవంగా జరిపించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనపర్తి కెనాల్ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం ఆధ్వర్యంలో తిరువాభరణ (అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు) ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సత్తి వీర్రెడ్డి అయ్యప్పస్వామి ఆభరణాలు ఉంచిన పెట్టెను శిరస్సున ధరించి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధి సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి ఇంటి వద్ద నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు అనపర్తిలోని ప్రధాన వీధుల నుంచి సాగి ఆలయానికి చేరుకుంది. జి.మామిడాడలోని బిక్కవోలు రోడ్డులో ప్రసిద్ధి చెందిన మణికంఠ స్వామివారి దివ్య మంగళ విగ్రహం ఆభరణాల పెట్టె ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో కొవ్వూరి వెంకటకృష్ణారెడ్డి ఇంటి వద్ద ప్రత్యేక పూజలు చేసి ఆభరణాల పెట్టెను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్తి భగవాన్ రెడ్డి, అర్చకుడు నంబూద్రి పూజలు చేశారు.

పెదపూడి: స్థానిక గోదాదేవి సమేత అభినవ వేంకటేశ్వరస్వామి, పెదపూడిలో జనార్దన స్వామివారి ఆలయం, సంపరలో శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం కమనీయంగా జరిగింది.

బిక్కవోలు: పందలపాకలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. బలభద్రపురంలో గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అర్చకులు రామగోపాలకృష్ణ, వేదాంతం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కొంకుదురుకు చెందిన తాడి వెంకట దుర్గారెడ్డి, సత్యవేణి దంపతులు కల్యాణకర్తగా వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: చండ్రేడులో చంద్రశేఖరస్వామి ఆలయంలో కాత్యాయనీ అమ్మవారికి గ్రామానికి చెందిన బిక్కిన రామస్వామి, వీరవేణి దంపతులు బంగారు ముక్కు పుడక సమర్పించారు. భోగి పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం బంగారు ముక్కుపుడకను అలంకరించినట్టు అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు.

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన రంగనాథ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు పండితులు పాణిగంపల్లి పవన్‌కుమార్ ఈ వేడుకను జరిపారు.

సంస్కృతీ సంప్రదాయాల మేళవింపు సంక్రాంతి


సంక్రాంతి వేడుకలకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: తెలుగు సంస్కృతీ సంప్రదాయాల మేళవింపు సంక్రాంతి పండగ అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని శనివారం అనపర్తిలో సంప్రదాయ సంక్రాంతి పోటీలకు ఆయన శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ కోడిపందేలను ఎమ్మెల్యే ప్రారంభించి కొద్దిసేపు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలు, జాతరలు సంస్కృతిలో భాగమన్నారు. సంక్రాంతి సమయంలో కోడి పందేల నిర్వహణకు చారిత్రక నేపథ్యం ఉందని, ఇవి పల్లెలకు మరింత శోభను తెస్తాయన్నారు. జీవహింస లేకుండా కోడి పందేలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని సూచించారు.

కోడిపందేలకు సై


పుణ్యక్షేత్రంలో కోడి పందేల వద్ద సందడి

రాజానగరం: సంక్రాంతి పండగల నేపథ్యంలో శనివారం కోడి పందేలు జోరుగా జరిగాయి. రాజానగరం మండలం శ్రీరామపురం, పుణ్యక్షేత్రం, దివాన్‌చెరువు (పాలచర్ల), నరేంద్రపురం, ముక్కినాడపాకలు, జియ్యరంపాలెం, కోరుకొండ మండలం గాదరాడ, కోరుకొండ, బూరుగుపూడి, దోసకాలయపల్లి, నిడిగట్ల, సీతానగరం మండలం పెదకొండేపూడి, నాగంపల్లి, మిర్తిపాడు, రూరల్ పరిధిలోని తొర్రేడు ఏరియాలలోని తోటలు కోడి పందేల బరులయ్యాయి. ఒక్కో బరిలో రూ. 5 లక్షల నుంచి రూ. 75 లక్షల వరకు పందేలు జరిగినట్లు సమాచారం.

రంగాపురంలో ముగ్గుల పోటీలు

బిక్కవోలు: రంగాపురంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గోవిందు గుప్తా, చెక్కా కృష్ణమూర్తి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులతో పంచాక్షరి కేటరింగ్ ఆధ్వర్యంలో సమకూర్చిన బహుమతులను విజేతలకు అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కనుమూరి సాయిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కనుమూరి వెంకటపతి రాజు, ఎంపీటీసీ ఏసురత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు కేతా అబ్బులు, నక్క మార్కండేయులు, గారపాటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వీరుళ్లమ్మ జాతర ప్రారంభం

అనపర్తి: అనపర్తి ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న వీరుళ్లమ్మ తల్లి జాతర, తీర్థ మహోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో ముస్తాబు చేశారు. అమ్మవారిని బంగారు, వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా ఐదు రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగులు ఆకట్టుకున్నాయి. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.